


ఆక్వాస్పోర్ట్స్‌లో సెల్ఫీ పాయింట్

సాగర తీరంలోని ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్ వద్ద సెల్ఫీ పాయింట్‌ను బుధవారం ఏర్పాటు చేశారు. 8లో



ఫుట్‌బాల్ విజేత ఎస్‌కేఎంఎల్ జట్టు

జిల్లా స్థాయి సీనియర్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ విజేతగా చినవాల్తేరుకు చెందిన ఎస్‌కేఎంఎల్ సీసీ జట్టు నిలిచింది. 8లో




సూరత్ స్పెషల్ పొడిగింపు

సూరత్ – బ్రహ్మపూర్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌ను మరికొంత కాలం పొడిగించినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. 8లో


ఏలేరుకు బ్రేక్?

భారీ పైప్‌లైన్ ప్రాజెక్టుకు మోకాలడ్డు

- ప్రస్తుతానికి అవసరం లేదని స్పష్టీకరణ
- కూటమి ప్రభుత్వం రాకతో విశాఖపై విషం చిమ్మేలా నిర్ణయాలు



సాక్షి, విశాఖపట్నం : ప్రతిపక్షంలో ఉన్నప్పుడు.. అధికారంలోకి వచ్చిన తర్వాత.. విశాఖ నగరంపై టీడీపీ, మిత్ర పక్షాలు విషం చిమ్ముతూనే ఉన్నాయి. గత ఐదేళ్ల కాలంలో వైజాగ్‌లో ఏ అభివృద్ధి జరిగినా.. కోర్టు కేసులతో అడ్డుకున్న టీడీపీ.. ఇప్పుడు అధికారం అడ్డం పెట్టుకుని అదే పంథా కొనసాగిస్తోంది. భవిష్యత్‌లో నగరం మరింత విస్తరించనుంది. భావితరాలకు నీటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వ సహకారంతో గత ప్రభుత్వం ఏర్పాటు చేయాలనుకున్న భారీ మంచి నీటి పైప్‌లైన్ ప్రాజెక్టుకు కూటమి ప్రభుత్వం మోకాలడ్డుతోంది. ఏలేరు పైప్‌లైన్ ప్రాజెక్టు ప్రస్తుతం అవసరం లేదని.. దాన్ని పక్కన పెట్టాలంటూ మంత్రులు హుకుం జారీ చేశారు.





విశాఖకు వద్దే వద్దు

విశాఖ నగరంలో కొద్ది రోజుల పాటు ఎలాంటి భారీ ప్రాజెక్టులకు ప్రణాళికలు సిద్ధం చేయవద్దంటూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఉన్నతాధికారులకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చినట్లు సమాచారం. ఈ ప్రాజెక్టు భవిష్యత్తు అవసరాలకు ముఖ్యమని ఇంజినీరింగ్ అధికారులు వివరించినా.. ప్రస్తుతం ఉన్న నీటి వనరులు సరిపోతాయని.. ఏదైనా ఇబ్బందులు వస్తే పునరాలోచిద్దామని వ్యాఖ్యానించినట్లు తెలిసింది. ఈ ప్రాజెక్టు ద్వారా విశాఖకు జలాలు తీసుకొస్తే.. ఆ క్రెడిట్ వైఎస్సార్ సీపీకి వెళ్లి పోతుందనే ఉద్దేశంతోనే.. ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రజలు భావిస్తున్నారు. ప్రజల అవసరాలకు ఉపయోగపడే ప్రాజెక్టుల విషయంలోనూ టీడీపీ ప్రజాప్రతినిధులు రాజకీయం చేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రాజెక్టు పూర్తయితే..

తూర్పుగోదావరి జిల్లాలోని ఏలేశ్వరం రిజర్వాయర్ నుంచి తాళ్లపాలెం రిజర్వాయర్ వరకు మొత్తం 126 కిలోమీటర్ల పొడవునా రూ.3,339 కోట్లు అవుతుందని గత ప్రభుత్వం నిర్ధారించింది. గ్రామాలకు, పారిశ్రామిక అవసరాలకు ఎలాంటి ఆటంకం లేకుండా.. రోజూ నీటిని అందించేలా ప్రాజెక్టు డిజైన్ చేసింది. రోజుకు 200 ఎంజీడీ నీటిని ఈ పైప్‌లైన్ ద్వారా సరఫరా చేయాలని.. ఏడాదికి 11 టీఎంసీలు చొప్పున 2050 వరకూ సరఫరా చేసేలా ప్రాజెక్టు తయారు చేసింది. ఈ పైప్‌లైన్ ద్వారా 30 ఏళ్ల పాటు విశాఖ రూరల్ గ్రామాలతో పాటు నర్సీపట్నం, యలమంచిలి మున్సిపాలిటీలు, విశాఖ నగరానికి తాగునీటి ఇబ్బందులు తలెత్తవు. ఇలాంటి అద్భుత ప్రాజెక్టుకు టీడీపీ ప్రభుత్వం బ్రేక్ వేసింది.

ప్రస్తుతానికి అవసరం లేదంట.?

భవిష్యత్‌లో నగరాలకు నీటిముప్పు తప్పదని.. దాని నుంచి తప్పించుకునేందుకు ఇప్పటి నుంచే ప్రణాళికలు అమలు చేయాలని ఐక్యరాజ్య సమితి స్పష్టం చేస్తోంది. భవిష్యత్‌లో విశాఖ వంటి కీలక నగరంలో నీటి ఎద్దడి తలెత్తే ప్రమాదం ఉంది. అందుకే.. గత ప్రభుత్వం ముందు చూపుతో ప్రాజెక్టు డిజైన్ చేస్తే.. విశాఖ ప్రజలు ఎలా పోతే తమకేంటంటూ కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోంది. నగర వాసులకు అత్యంత ముఖ్యమైన ప్రాజెక్టు ప్రస్తుతానికి అవసరం లేదంటూ జీవీఎంసీ అధికారులకు ప్రభుత్వ పెద్దలు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది.


ప్రాజెక్టు స్వరూపమిదీ

- ఏలేరు నుంచి విశాఖకు తాగునీరు సరఫరా
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రణాళికలు
- రూ.3,339 కోట్లతో 126 కి.మీ. మేర పైప్‌లైన్
- 2050 నాటికి ప్రజల నీటి అవసరాలు తీర్చేలా రూపకల్పన
- జల్‌జీవన్‌మిషన్ ద్వారా నిధుల సమీకరణకు యత్నాలు

డీపీఆర్ కూడా తయారీ

WAPCOS

విశాఖ జిల్లా ప్రజల దాహార్తి తీర్చేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం భారీ ప్రాజెక్టుకు రూపకల్పన చేసింది. 2050 వరకు నగర, పట్టణ, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ఏలేరు నుంచి విశాఖకు పైప్‌లైన్ తీసుకురావాలని నిర్ణయించింది. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జల్‌జీవన్ మిషన్ నుంచి నిధులు సేకరించేందుకు మినీరత్న కంపెనీ అయిన వాటర్ అండ్ పవర్ కన్సల్టెన్సీ సర్వీస్(వాప్కోస్)తో ఒప్పందం కుదుర్చుకుని డీపీఆర్ కూడా తయారు చేసింది.



న్యూస్‌రీల్

ఫ్యాన్సీ నంబర్ ప్లేట్లు ఉన్న 63 వాహనాలపై కేసులు



తనిఖీలు నిర్వహిస్తున్న రవాణా శాఖ అధికారులు

గోపాలపట్నం: నిబంధనలకు విరుద్ధంగా వాహనాల నంబర్ ప్లేట్లను మార్చిన 63 మందిపై రవాణా శాఖ అధికారులు కేసులు నమోదు చేశారు. హై సెక్యూరిటీ ప్లేట్లు కాకుండా.. విచిత్రంగా తయారు చేసుకున్న నంబర్ ప్లేట్లతో తిరుగుతున్న వాహనాలపై బుధవారం ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. హనుమంతవాక, ఎన్‌ఎస్‌టీఎల్, బోయపాలెం తదితర ప్రాంతాల్లో జరిగిన తనిఖీల్లో 63 వాహనాలపై కేసులు నమోదు చేశారు. ఎంవీఐలు బి.బాలాజీరావు, ఎ.ఎస్.గణేష్‌రెడ్డి, రాజారావు, మాధవి, ఏఎంవీఐలు సుమన్ కుమార్, పి.శిరీష, పార్వతి, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

స్ట్రక్చరల్ మిల్ రికార్డు ఉత్పత్తి



ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ స్ట్రక్చరల్ మిల్ (ఎస్టీఎం) మంగళవారం రికార్డు ఉత్పత్తి సాధించింది. ఆ రోజు మూడు షిఫ్ట్‌ల్లో 66 ఎం.ఎం రౌండ్ 2,639 టన్నులు ఉత్పత్తి చేసింది. ఇప్పటి వరకు ఇదే అత్యధిక ఉత్పత్తి కావడంతో విభాగం ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. ఉద్యోగులను విభాగం అధికారులు అభినందించారు.

జీవీఎంసీ ఏడీసీగా రమణమూర్తి

విశాఖ సిటీ: జీవీఎంసీ అదనపు కమిషనర్‌గా డి.వి.రమణమూర్తి నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు ఈ స్థానంలో విధులు నిర్వర్తిస్తున్న వి.సన్యాసిరావు డిప్యుటేషన్ పొడిగించలేదు. మాతృ సంస్థ జైళ్ల శాఖకు పంపించారు. అతని స్థానంలో కాకినాడలో సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ జాయింట్ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న డి.వి.రమణమూర్తిని డిప్యుటేషన్‌పై జీవీఎంసీ ఏడీసీగా నియమించారు.

జీవీఎంసీ ఇన్‌చార్జి సీఈగా వినయ్ కుమార్



సాక్షి, విశాఖపట్నం: మహా విశాఖ నగర పాలక సంస్థ(జీవీఎంసీ) ఇన్‌చార్జి చీఫ్ ఇంజినీర్‌గా వినయ్‌కుమార్‌ను నియమిస్తూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం చీఫ్ ఇంజినీర్‌గా వ్యవహరిస్తున్న రవికృష్ణరాజు బుధవారం ఉద్యోగ విరమణ చేశారు. ఆయన స్థానంలో వినయ్‌ని నియమించారు. ప్రస్తుతం వినయ్‌కుమార్ జీవీఎంసీ స్మార్ట్ సిటీ సూపరింటెండెంట్ ఇంజినీర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈఎన్‌సీ ఆధ్వర్యంలో ప్యానెల్ నిర్వహించి.. సీనియర్‌కి చీఫ్ ఇంజినీర్‌గా అవకాశం కల్పించనున్నారు. అంతవరకు ఇన్‌చార్జి సీఈగా వినయ్ కుమార్ వ్యవహరించనున్నారు.

ప్రత్యేక కౌంటర్లలో బియ్యం, కందిపప్పు విక్రయం

మహారాణిపేట: జిల్లాలోని అన్ని ప్రత్యేక కౌంటర్లలో గురువారం నుంచి ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు బియ్యం, కందిపప్పు విక్రయించాలని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి జి.సూర్యప్రకాశరావు ఆదేశించారు. బియ్యం(బీపీటీ/సోనామసూరి రకం) కిలో రూ.48కు, దేశవాళీ కందిపప్పు కిలో రూ.150కు విక్రయించాలని స్పష్టం చేశారు. ప్రతి కౌంటర్ ముందు తగ్గింపు ధరలకు సంబంధించిన బ్యానర్ ప్రదర్శించాలని ఓ ప్రకటనలో సూచించారు.

నేటి నుంచి విద్యార్థులకు నేత్ర పరీక్షలు

సీతంపేట: జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కంటి పరీక్షలు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్టు సంస్థ ప్రోగ్రామ్ మేనేజర్ డాక్టర్ ఎ.మీనాక్షి తెలిపారు. జిల్లాలో సుమారు 220 పాఠశాలల్లో 51,954 మంది విద్యార్థులకు పారా మెడికల్ ఆప్తాల్మిక్ ఆఫీసర్లు, అసిస్టెంట్లు కంటి పరీక్షలు చేస్తారని, అవసరమైన వారికి కళ్ల అద్దాలు ఉచితంగా ప్రభుత్వం ఇస్తుందని పేర్కొన్నారు. వచ్చే మూడు నెలల్లో కంటి పరీక్షలు పూర్తిచేసేలా ప్రణాళిక రూపొందించామన్నారు.

పటిష్టంగా 'ఎమ్మెల్సీ' ఎన్నికల కోడ్ అమలు

- యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి
- కలెక్టర్ హరేందిర ప్రసాద్



వెబెక్స్ ద్వారా సమీక్షిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: ఉమ్మడి విశాఖ జిల్లాలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించిన నేపథ్యంలో తక్షణం ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని, అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ ఆదేశించారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలపై బుధవారం ఆయన కలెక్టర్ కార్యాలయం నుంచి వెబెక్స్ ద్వారా అధికారులతో సమీక్ష నిర్వహించారు.

6న నోటిఫికేషన్ : స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఈ నెల 6న నోటిఫికేషన్ విడుదల చేస్తామని కలెక్టర్ తెలిపారు. ఆగస్టు 13 వరకు నామినేషన్ల స్వీకరణ, 14న పరిశీలన, 16 వరకు నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందన్నారు. 30న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్, సెప్టెంబర్ 3న ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఉంటుందని వెల్లడించారు.

ఎంసీసీ కోడ్ తక్షణం అమలు

కోడ్ అమల్లోకి వచ్చినందున వెంటనే అన్ని ప్రభుత్వ కార్యాలయాల పరిధిలోని రాజకీయ నాయకుల చిత్రపటాలు, పోస్టర్లు, బ్యానర్లు తొలగించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. బస్సులు, బస్ స్టేషన్లు, పబ్లిక్ ప్రదేశాల్లోని రాజకీయ పరమైన ప్రకటనలు, ఇతర చిత్రాలను తొలగించాలన్నారు. రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయాలని ఆదేశించారు. ఎన్నికలతో సంబంధం ఉన్న ఏ ఒక్క అధికారి జిల్లాలో గాని ఇతర జిల్లాల్లో గాని రాజకీయ నాయకులకు సంబంధించిన ఎటువంటి సమావేశాలకు హాజరు కాకూడదన్నారు. స్థానిక సంస్థల సభ్యులు ఎటువంటి రాజకీయ సమావేశాలు నిర్వహించకూడదని, కలెక్టర్ ముందస్తు అనుమతితో అత్యవసర సమావేశాలు నిర్వహించవచ్చని పేర్కొన్నారు.

అధికారులు మాత్రమే పింఛన్లు పంపిణీ చేయాలి

ప్రభుత్వ సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం పూర్తిస్థాయిలో అధికారుల సమక్షంలో మాత్రమే జరగాలని, రాజకీయ నాయకులు, ఇతర స్థానిక సంస్థల సభ్యులు ప్రమేయం ఎట్టి పరిస్థితుల్లోనూ ఉండకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి మండలంలో వీడియోగ్రఫీ బృందాలను ఏర్పాటు చేయాలని, అనధికార డబ్బు, మద్యం తరలింపును పూర్తిస్థాయిలో అరికట్టాలని ఆదేశించారు. అధికారులందరూ ఎన్నికల నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ.. ఎమ్మెల్సీ ఉప ఎన్నికను విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించాలని కోరారు. జేసీ కె.మయూర్ అశోక్, జీవీఎంసీ, రెవెన్యూ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రకటనల కోసం అభ్యర్థులు ముందస్తు అనుమతి తప్పనిసరి అని కలెక్టర్ తెలిపారు. ప్రచారాలను జిల్లా మీడియా సర్టిఫికేషన్, మానిటరింగ్ కమిటీ అనుమతితో మాత్రమే నిర్వహించాలన్నారు.

వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయం

- మెజార్టీ ఓటర్లు ఆ పార్టీకి చెందినవారే..
- ప్రలోభాలకు తెరతీసిన కూటమి నేతలు

జెడ్పీటీసీలు	36
ఎంపీటీసీ	636
కౌన్సిలర్లు	53
కార్పొరేటర్లు	97
మొత్తం ఓటర్లు	822

మహారాణిపేట : ఉమ్మడి విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపరిచే అభ్యర్థి విజయం లాంఛనమే. ఎందుకంటే ప్రస్తుతం ఉన్న ఓటర్లలో మెజార్టీ సభ్యులు వైఎస్సార్ సీపీకి చెందిన వారే ఉన్నారు. స్థానిక ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రస్తుతం 822 మంది ఓటర్లు ఉన్నారు. జిల్లా పరిషత్ పరిధిలో 39 మంది జెడ్పీటీసీ సభ్యులు ఉండాల్సి ఉండగా.. మూడు జెడ్పీటీసీ స్థానాలు ఖాళీగా ఉన్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం అరకు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అనకాపల్లి జిల్లా రావికమతం జెడ్పీటీసీ సభ్యురాలు తలారి రమణమ్మ, సబ్బవరం జెడ్పీటీసీ సభ్యుడు తుంపాల అప్పారావు మరణించారు. ప్రస్తుతం ఉన్న 36 మందిలో 34 మంది జెడ్పీటీసీలు వైఎస్సార్ సీపీకి, నర్సీపట్నం జెడ్పీటీసీ సభ్యుడు తెలుగుదేశం పార్టీకి, అనంతగిరి జెడ్పీటీసీ సభ్యుడు సీపీఎం పార్టీకి చెందిన వారు ఉన్నారు. అలాగే 652 మంది ఎంపీటీసీలకు గానూ ప్రస్తుతం 636 మంది ఎంపీటీసీలు ఉన్నారు. 16 ఎంపీటీసీలు ఖాళీగా ఉన్నాయి. జీవీఎంసీలో 98 మంది కార్పొరేటర్లకు గానూ ఒక కార్పొరేటర్ స్థానం ఖాళీగా ఉంది. 21వ వార్డు నుంచి ఎన్నికైన వంశీకృష్ణ శ్రీనివాస్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఎన్నిక కావడంతో కార్పొరేటర్ పదవికి రాజీనామా చేశారు. తర్వాత ఆయన జనసేనలోకి ఫిరాయించడంతో శాసనమండలి చైర్మన్ అనర్హత వేటు వేశారు. ఆ స్థానానికే ఇప్పుడు ఎన్నిక జరుగుతోంది. ఇక యలమంచిలి పురపాలక సంఘం పరిధిలో 25, నర్సీపట్నం పురపాలక సంఘం పరిధిలో 28 మంది కౌన్సిలర్లు ఉన్నారు. 90 శాతం మంది వైఎస్సార్ సీపీకి చెందిన వారు ఉండడంతో ఆ పార్టీ అభ్యర్థి విజయం నల్లేరుమీద నడకే. ఈ పరిస్థితుల్లో కూటమి నేతలు కుట్రలకు తెరతీశారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నారు. అభ్యర్థిని పోటీలో నిలిపేందుకు సన్నద్ధమవుతున్నారు. అయినప్పటికీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సునాయాసంగా విజయం సాధించే అవకాశాలు ఉన్నాయని విశ్లేషకులు అంటున్నారు.

సివిల్ వివాదాలకు చెక్..!

- వివాదాల సత్వర పరిష్కారంపై సీపీ శంఖబ్రత బాగ్చి దృష్టి
- ప్రీ లిటిగేషన్ కౌన్సెలింగ్ ఫోరం ప్రారంభం
- వృద్ధుల భూ, ఇంటి సమస్యల పరిష్కారానికి చర్యలు
- రెవెన్యూ, మున్సిపల్, పోలీస్ అధికారుల సమక్షంలో సామరస్యంగా ఇరువర్గాలతో చర్చలు



ప్రీ లిటిగేషన్ ఫోరంను ప్రారంభిస్తున్న సీపీ బాగ్చి

విశాఖ సిటీ: సివిల్ వివాదాలు కొన్ని సందర్భాల్లో తీవ్ర పరిణామాలకు దారితీస్తున్నాయి. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నాయి. ఫలితంగా విశాఖలో క్రైమ్ రేట్ పెరుగుదలకు కారణమవుతున్నాయి. ఇటువంటి నేరాలకు చెక్ పెట్టేందుకు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి చర్యలకు ఉపక్రమించారు. సివిల్ వివాదాల సత్వర పరిష్కారానికి ప్రీ లిటిగేషన్ కౌన్సెలింగ్ ఫోరం(పీఎల్‌సీఎఫ్)ను బుధవారం ప్రారంభించారు. వృద్ధుల ఆస్తి వివాదాల పరిష్కారంపై ఈ ఫోరం దృష్టి పెట్టనుంది. ఇందులో రెవెన్యూ, మున్సిపల్, పోలీస్ శాఖల నుంచి ఒక్కో అధికారి ఉండనున్నారు. వీరు ఇరు వర్గాలతో సామరస్యపూరితంగా, చట్టపరంగా చర్చించి వివాదాలను పరిష్కరించనున్నారు.

వృద్ధుల సమస్యలపై దృష్టి

అనేక మంది ఉద్యోగ, పదవీ విరమణ తరువాత ప్రశాంత విశాఖలో స్థిరపడాలని ఇతర ప్రాంతాల నుంచి సైతం నగరానికి వస్తున్నారు. ఏదైనా సివిల్ వివాదం తలెత్తితే పోలీస్‌స్టేషన్‌కు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్న వారు అనేక మంది ఉన్నారు. ఇటీవల కాలంలో డయల్ యువర్ సీపీ, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అనేక ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో సివిల్ వివాదంలో సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు వెళ్లలేక ఇబ్బందులు పడే వారి కోసం ప్రత్యేకంగా పీఎల్‌సీఎఫ్‌ను ఏర్పాటు చేశారు. వృద్ధుల స్థలాలు కబ్జాకు గురికావడం, వారి ఇళ్లలో అద్దెకు ఉంటున్న వారు ఖాళీ చేయకపోవడం, అద్దె చెల్లించకపోవడం, నగదు తీసుకొని తిరిగి ఇవ్వకపోవడం, ఇతర సివిల్ వివాదాల పరిష్కారంపై ఈ ఫోరం దృష్టి పెట్టనుంది. అలాగే కుటుంబ వివాదాలు, పొరుగువారు/ఇతర వ్యక్తులతో వివాదాలు, డబ్బు, రుణాలు, చిట్స్ వివాదాలు, భూ యజమాని, అద్దెదారు వివాదాలు, న్యూసెన్స్, ఇతర సమస్యలకు సంబంధించిన వివాదాల పరిష్కారానికి కూడా చర్యలు చేపట్టనున్నారు. ఇరు వర్గాలతో చర్చించి, పారదర్శకంగా సమస్యను పరిష్కరించనున్నారు.

వీడియో కాల్ ద్వారా ఫిర్యాదుకు అవకాశం

అనారోగ్య కారణాలు లేదా ఇతర సమస్యలు కారణంగా నేరుగా రాలేని వారు వీడియో కాల్ ద్వారా కూడా ఫిర్యాదు చేసుకొనే వెసులుబాటు కల్పిస్తున్నారు. ఇందులో అవసరమైన డాక్యుమెంట్లు అందజేయాల్సి ఉంటుంది. అయితే కోర్టు పరిధిలో ఉన్న వాటిని మాత్రం పరిగణనలోకి తీసుకునే అవకాశం లేదు. ఇందులో ఏదైనా నేరపూరిత వ్యవహారాన్ని గుర్తిస్తే బాధ్యులపై వెంటనే సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్‌ఐఆర్ నమోదు చేయాలని నిర్ణయించారు.

సోమవారం నుంచి శనివారం వరకు..

ప్రీ లిటిగేషన్ కౌన్సెలింగ్ ఫోరం సోమవారం నుంచి శనివారం వరకు పోలీస్ బ్యారెక్స్ ప్రాంగణంలో పనిచేయనుంది. వివాదాలకు సంబంధించిన పార్టీలను సిట్టింగ్ రోజుల్లో పిలిపించి, కౌన్సెలింగ్ జరిపి, వివాదాలు పరిష్కరించనున్నారు. తరువాత రోజు పార్టీలు రాజీ పడితే.. లోక్ అదాలత్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎదుట ఇరువర్గాలను హాజరు పరిచి చట్టపరమైన సేవల అథారిటీ చట్టం 1987, యూ/ఎస్ 22 (సి) ప్రకారం తుది ఉత్తర్వులు సంబంధిత న్యాయస్థానం ద్వారా అందించనున్నారు. బుధవారం నుంచి ప్రారంభమైన ఈ ఫోరం సేవలను పొందాలనుకునే వారు సంబంధిత పోలీస్‌స్టేషన్లను సంప్రదించాలని సీపీ శంఖబ్రత బాగ్చి సూచించారు. పూర్తి పారదర్శకంగా హక్కుదారులకు న్యాయం జరిగేలా చేయడమే ఈ ఫోరం లక్ష్యమని పేర్కొన్నారు.

హెల్త్ ఎరీనాలో సదుపాయాలు కల్పించాలి



అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్ విశ్వనాథన్

విశాఖ సిటీ: హెల్త్ ఎరీనాలో మెరుగైన సదుపాయాలు కల్పించాలని వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం ఆయన హెల్త్ ఎరీనాను సందర్శించారు. అక్కడ పాడైన విషయ సూచక బోర్డు, సిమెంట్ బెంచీలను బాగు చేయించాలని చెప్పారు. అలాగే విద్యుద్దీపాలు మార్చడం, సందర్శకులకు తాగునీరు, పారిశుధ్య సదుపాయాలు కల్పించడంతో పాటు చెట్ల వ్యర్థాలను తరలించడం, పచ్చదనం పెంపు వంటి అంశాలపై పలు సూచనలు చేశారు. అనంతరం కైలాసగిరి, సిరిపురం ప్రాంతంలో ఉన్న బాలల ప్రాంగణం, వైశాఖి జల ఉద్యానవనం, సీతమ్మధార, ఎంవీపీకాలనీల్లో సంస్థకు చెందిన దుకాణ సముదాయాలను పరిశీలించారు. దుకాణదారుల నుంచి బకాయిలు సకాలంలో వసూలయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. ఖాళీగా ఉన్న వాణిజ్య సముదాయాల కేటాయింపునకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయనతో వీఎంఆర్‌డీఏ కార్యదర్శి కీర్తి, డీఎఫ్‌వో శాంతి స్వరూప్, సీఈ భవానీశంకర్, ఎస్ఈ బలరామ రాజు, రేంజ్ ఆఫీసర్లు శ్యామల, శార్వాణి, కార్యనిర్వాహక ఇంజినీర్లు రాజు, రామరాజు ఉన్నారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్‌కు దరఖాస్తులు

విశాఖ విద్య : సార్వత్రిక విద్యా విధానంలో టెన్త్, ఇంటర్మీడియెట్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో ఎల్.చంద్రకళ తెలిపారు. ఈ నెల 28 వరకు తగిన ఫీజు చెల్లించి కోర్సుల్లో చేరవచ్చన్నారు. వివరాలకు దగ్గరలోని పాఠశాలలను సంప్రదించాలని సూచించారు.

ఈపీడీసీఎల్‌లో బదిలీలు, పదోన్నతులు



శ్యామ్‌బాబు

- సీజీఎంలుగా బి.అశోక్‌కుమార్, టీవీఎస్ఎన్ మూర్తి
- విశాఖ సర్కిల్ ఎస్ఈగా శ్యామ్‌బాబు

సాక్షి, విశాఖపట్నం : ఏపీఈపీడీసీఎల్ పరిధిలో పలువురు అధికారులకు పదోన్నతులు కల్పిస్తూ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రాజెక్ట్స్ జీఎంగా ఉన్న బి.అశోక్‌కుమార్, రాజమండ్రి ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ టీవీఎస్ఎన్ మూర్తిని చీఫ్ జనరల్ మేనేజర్లుగా పదోన్నతులు కల్పిస్తూ కార్పొరేట్ కార్యాలయానికి బదిలీ చేశారు. కార్పొరేట్ కార్యాలయం ఆపరేషన్స్-2 జీఎంగా ఉన్న జి.శ్యామ్‌బాబుని విశాఖ సర్కిల్ ఎస్ఈగా, ప్రస్తుతం విశాఖపట్నం సర్కిల్ ఎస్ఈని క్వాలిటీ కంట్రోల్ జీఎంగా బదిలీ చేశారు.

స్క్రాప్ తొలగింపునకు సీల్డ్ టెండర్లు

విశాఖ సిటీ: వీఎంఆర్‌డీఏ ప్రాంగణంలో స్క్రాప్ మెటీరియల్ తొలగింపు, క్లియరెన్స్‌కు సీల్డ్ టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ కార్యదర్శి డి.కీర్తి తెలిపారు. ఇనుము, కర్ర చెక్కలు, అల్యూమినియం స్క్రాప్, ప్లాస్టిక్ మెటీరియల్స్, చెక్క టేబుల్స్, స్క్రాప్‌గా పరిగణించే ఇతర పదార్థాలు, వస్తువుల తొలగింపునకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు వివరించారు. వీటి పూర్తి వివరాలు www.vmrda.gov.in వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు వెల్లడించారు. ఆసక్తి గల స్క్రాప్ విక్రేతలు దరఖాస్తులను ఆ వెబ్‌సైట్ నుంచి గానీ లేదా వీఎంఆర్‌డీఏ కార్యాలయం 8వ అంతస్తులో రెవెన్యూ విభాగంలో పొందవచ్చని సూచించారు. దరఖాస్తు, చలానా, డీడీలు 8వ అంతస్తులో ఈ నెల 1వ తేదీ నుంచి 7వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా అందజేయాలని సూచించారు.



క్లుప్తంగా

గంజాయితో పట్టుబడిన ఇద్దరికి జైలు

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో గంజాయితో పట్టుబడిన ఇద్దరికి మొదటి అడిషనల్ మెట్రోపాలిటన్ సెషన్స్ న్యాయమూర్తి మూడేళ్ల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధించారు. ఈ వివరాలను విశాఖపట్నం జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు బుధవారం వెల్లడించారు. క్రైం నంబర్ 55/2021లో ఉత్తరప్రదేశ్‌కు చెందిన నివారు, సబిత నేరం చేసినట్లు రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు చెప్పారన్నారు.

నేటి నుంచి పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికల ప్రక్రియ

విశాఖ విద్య: పాఠశాలల యాజమాన్య కమిటీలకు ఎన్నికల షెడ్యూల్ జారీ చేసినట్లు సమగ్ర శిక్ష ఏపీసీ శ్రీనివాస్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 1 నుంచి 8 వరకు ఎన్నికల ప్రక్రియ ఉంటుందన్నారు. రాష్ట్ర పథక సంచాలకుల ఆదేశాలకు అనుగుణంగా ఎన్నికల మార్గదర్శకాలను జిల్లాలోని అన్ని మండల విద్యాశాఖాధికారులకు పంపించినట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు సమగ్ర శిక్ష ఏపీసీ, అదే విధంగా మండల విద్యాశాఖాధికారి కార్యాలయాల్లో సంప్రదించాలన్నారు.

ఆక్వాస్పోర్ట్స్‌లో సెల్ఫీ పాయింట్

విశాఖ స్పోర్ట్స్: సాగర తీరంలోని ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్ వద్ద సెల్ఫీ పాయింట్‌ను బుధవారం ఏర్పాటు చేశారు. ది ఒలింపిక్ సంఘం విశాఖ, డీఎస్‌ఏల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సంఘం చైర్మన్ ఈ పాయింట్‌ను ప్రారంభించగా అధ్యక్షుడు ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశాఖ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు ఒలింపిక్స్ క్రీడల్లో దేశం తరపున పాల్గొంటున్న క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు, డీఎస్‌ఏ కోచ్‌లు పాల్గొన్నారు.

ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్ కోసం దరఖాస్తుల ఆహ్వానం

డాబాగార్డెన్స్: ఐటీఐలో ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఏపీఎస్ ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్ కోసం దరఖాస్తులు చేసుకోవాలని ఏపీఎస్ ఆర్టీసీ విజయనగరం జోనల్ అధికారి రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. డీజిమెకానిక్, మోటార్ మెకానిక్, ఎలక్ట్రీషియన్ వెల్డర్, పెయింటర్, ఫిట్టర్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, షీట్ మెటల్ వర్కర్ తదితర విభాగాలకు సంబంధించి అప్రెంటిస్‌షిప్ కోసం ఈనెల 16వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను https://www.apprenticeshipindia.gov.in/ వెబ్‌సైట్‌లో పొందవచ్చన్నారు. విశాఖపట్నం, పార్వతీపురం మన్యం జిల్లా అభ్యర్థులు ఈనెల 22న, డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ, విజయనగరం జిల్లా అభ్యర్థులు ఈనెల 23న, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, అనకాపల్లి జిల్లా అభ్యర్థులు ఈనెల 24న, శ్రీకాకుళం, తూర్పుగోదావరి జిల్లా అభ్యర్థులు ఈనెల 27న హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు 08922–294906 నెంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

రెడ్ బుక్ ఫ్లెక్సీలు.. కూటమి నేతల హోర్డింగ్‌లు



చంద్రబాబు, గణబాబు పేరుతో డిజిటల్ బోర్డు

విశాఖ విద్య: నగరంలో ఎక్కడికక్కడ 'రెడ్ బుక్' ఫ్లెక్సీలు దర్శనమిస్తున్నాయి. హెచ్చరికలు జారీ చేస్తూ రాయించిన ఈ ఫ్లెక్సీలను టీడీపీ నాయకులే ఏర్పాటు చేశారు. అలాగే ఎన్‌ఏడీ ఫ్లై ఓవర్ మధ్యలో జిగేల్ మనే విద్యుత్ కాంతులతో 'ఐ లవ్ చంద్రబాబు... గణబాబు' అంటూ డిజిటల్ బోర్డు పెట్టారు. కూటమి నేతలు అత్యుత్సాహంతో ఫ్లై ఓవర్ మధ్యలో ఈ బోర్డు పెట్టడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనికి నగర పాలక సంస్థ నుంచి అనుమతులు ఉన్నాయా..? విద్యుత్ వినియోగానికి ఆ శాఖ నుంచి అనుమతులు తీసుకున్నారా..? అనేది పరిశీలనలో తేలాల్సి ఉంది. ఇది ఇలా ఉంటే స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ బుధవారం నుంచి అమల్లోకి వచ్చిన నేపథ్యంలో కొన్ని చోట్ల సాయంత్రానికి ఫ్లెక్సీలు తొలగించారు. అయినా చాలా చోట్ల ఫ్లెక్సీలు కనిపిస్తున్నాయి.



ఫ్లెక్సీలో రెడ్ బుక్ హెచ్చరికలు

గ్యాస్ సిలిండర్‌తో బంక్‌ను పేల్చేస్తా..

- పవన్ అభిమానినంటూ పెట్రోల్ బంక్ వద్ద వ్యక్తి హల్‌చల్
- తనకు అన్యాయం జరిగిందంటూ ఆవేదన
- భయంతో పరుగులు తీసిన సిబ్బంది, వినియోగదారులు


అన్‌లోడ్ అవుతున్న పెట్రోల్ ట్యాంకర్ వద్ద సిలిండర్ పెట్టి భయభ్రాంతులకు గురిచేస్తున్న రాజు

సింహాచలం: అడవివరంలోని పాత గోశాల జంక్షన్ వద్ద గల పెట్రోల్ బంక్‌లో పవన్ కల్యాణ్ అభిమానినంటూ ఓ ఆటోడ్రైవర్ బుధవారం హల్‌చల్ చేశాడు. రెగ్యులేటర్ బిగించి ఉన్న గ్యాస్ సిలిండర్, లైటర్, చాకు తన వెంట తీసుకొచ్చి... అన్‌లోడ్ అవుతున్న పెట్రోల్ ట్యాంక్ వద్ద వాటిని ఉంచాడు. ఆటోపై పెట్రోల్ పోసి.. గ్యాస్ సిలిండర్‌తో ట్యాంకర్, బంక్‌ను పేల్చేస్తానని బెదిరించాడు. దీంతో బంక్‌లో పనిచేస్తున్న సిబ్బంది, పెట్రోల్ కొట్టించుకునేందుకు వేచి ఉన్న వినియోగదారులు భయంతో పరుగులు తీశారు. వారంతా దూరం నుంచి ఎంత చెబుతున్నా వారి మాటలను అతను పట్టించుకోలేదు. పైగా వారితో వాదనకు దిగాడు. లైటర్‌ను వెలిగించే క్రమంలో .. ధైర్యం తెచ్చుకున్న పెట్రోల్ బంక్ సిబ్బంది వెనుక నుంచి అతన్ని చాకచక్యంగా పట్టుకున్నారు. వెంటనే బంక్ నుంచి అతన్ని బయటకు తీసుకొచ్చి సిబ్బంది, పలువురు వినియోగదారులు తాళ్లతో బంధించారు. దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ క్రమంలో అతను మాట్లాడుతూ తన పేరు రాజు అని, అందరూ రోలెక్స్ అని పిలుస్తారని తెలిపాడు. గోపాలపట్నం దరి కొత్తపాలెంలో ఉంటానని చెప్పుకొచ్చిన ఆయన తనకు అన్యాయం జరిగిందన్నాడు. తన భార్య రెండు రోజుల కిందట పాపకి జన్మనిచ్చిందని, అడ్వాన్స్ ఉన్నా వారం రోజుల కిందట ఇంటి యజమాని బయటకు తోసేశాడని చెప్పాడు. తన భార్యనుద్దేశించి ఇంటి యజమాని అగౌరవంగా మాట్లాడాడని, పోలీస్ స్టేషన్‌కి వెళ్లినా ఎవరూ పట్టించుకోలేదన్నాడు. పోలీస్ స్టేషన్‌లో న్యాయం జరగలేదని, లా అండ్ ఆర్డర్ బాగాలేదన్నాడు. మీడియాతో మాట్లాడాలని డిమాండ్ చేశాడు. కాగా బంకు సిబ్బంది ఫిర్యాదుతో సంఘటన స్థలానికి చేరుకున్న పెందుర్తి పోలీసులు రాజును స్టేషన్‌కి తరలించారు. అతన్ని విచారిస్తున్నట్టు సీఐ రామకృష్ణ తెలిపారు.

బ్రాహ్మణులను గౌరవించకపోవడం విచారకరం

పీఎం పాలెం: పురోహిత బ్రాహ్మణ సమాజానికి ప్రస్తుతం తగిన గౌరవ మర్యాదలు లభించకపోవడం విచారకరమని రాష్ట్ర పురోహిత బ్రాహ్మణ సమాఖ్య సభ్యులు ఆవేదన వ్యక్తం శారు. శిల్పారామం (జాతర)లో రాష్ట్ర పురోహిత బ్రాహ్మణ సమాఖ్య ప్రతినిధుల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సమాఖ్య గౌరవ అధ్యక్షుడు యామిజాల నరసింహ మూర్తి మాట్లాడుతూ బ్రాహ్మణుల ప్రాధాన్యతను నేటి తరం గుర్తించి సనాతన సంప్రదాయాలకు గట్టి పునాదులు వేయాలని కోరారు. అనంతరం విశేష సేవలందించిన పరోహితులను విప్ర సేవక్ పురస్కారాలతో ఘనంగా సత్కరించారు. నూతనంగా ఎన్నికైన సమాఖ్య రాష్ట్ర కార్యవర్గ సభ్యులకు నియామక పత్రాలు అందజేశారు. ముందుగా శ్రీలక్ష్మీ గణపతి హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెన్నేటి విద్యాధరరావు, రాష్ట్ర సమాఖ్య అధ్యక్షుడు నారాయణ మూర్తి, ప్రధాన కార్యదర్శి దుర్గబాబు, రవి, మణిశంకర్, జిల్లా అధ్యక్షుడు సత్యశ్రీనివాస శర్మ, ఉమామహేశ్వర శర్మ, అంజనీ కుమార్ శర్మ పాల్గొన్నారు.


సమావేశంలో పురోహిత బ్రాహ్మణ సమాఖ్య ప్రముఖులు

ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయాలి

మహారాణిపేట: ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని, ప్రజలకు, నోడల్ ఏజెన్సీలకు సకాలంలో సరకులు అందజేయాలని జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్ సూచించారు. కలెక్టరేట్ వీసీ హాలులో ఈ మేరకు వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రాలకు, వసతి గృహాలకు, మధ్యాహ్న భోజనం పథకానికి సంబంధించి పాఠశాలలకు సరఫరా అవుతున్న సరకుల గురించి, ఎండీయూ వాహనాల ద్వారా ప్రజలకు పంపిణీ చేస్తున్న సరకుల గురించి ఆయా శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజా అవసరాలకు, ఇతర ఏజెన్సీ నిర్వాహకులకు నాణ్యమైన సరకులు అందజేయాలని అధికారులను ఆదేశించారు. రేషన్ సరకులు తప్పుదారి పట్టకుండా చర్యలు తీసుకోవాలని, ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అందే సేవలను మరింత విస్తృతం చేయాలని సూచించారు. ఈ క్రమంలో ఆయా శాఖల పరిధిలో ఉండే సమస్యలను అధికారులు జేసీ దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో డీఎస్‌వో సూర్యప్రకాశరావు, సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ రాజేశ్వరి, ఐసీడీఎస్ పీడీ జయదేవి, డీఈవో చంద్రకళ, బీసీ వెల్ఫేర్ అధికారిణి శ్రీదేవి, హెచ్ఎంలు, వివిధ ఏజెన్సీల నిర్వాహకులు, సీడీపీవోలు, అంగన్వాడీ నిర్వాహకులు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.


జేసీ మయూర్ అశోక్

రేషన్ కోట.. సరకుల కోత

- ఆగస్టులో బియ్యం మాత్రమే సరఫరా?
- పామాయిల్, కందిపప్పు, పంచదార, చోడి పిండి పంపిణీ లేనట్టే!

మహారాణిపేట: కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రజలకు నిత్యావసరాలు భారంగా మారాయి. జిల్లాలో రేషన్ కార్డులమీద నిత్యావసరాలు (పీడీఎస్) పంపిణీ అరకొరగానే సాగుతోంది. ఆగస్టు ఒకటో తేదీన సబ్సిడీ బియ్యం మాత్రమే సరఫరా చేయనున్నారు. మిగిలిన నిత్యావసరాలు సరఫరా చేయడం లేదని సమాచారం. పంచదార, గోధుమ పిండి, కందిపప్పు, చోడిపిండి సరఫరా చేయడం లేదని డీలర్లు చెబుతున్నారు. అర్బన్ డీఎస్‌వో పరిధిలో మధురవాడ, ఆనందపురం, భీమిలి, పద్మనాభం, పెందుర్తి ప్రాంతాలు ఉన్నాయి. జిల్లాలో 5,12,619 తెలుపు కార్డుదారులున్నారు. వీరందరికీ నిత్యావసరాలు అందించాల్సి ఉండగా.. ఆగస్టులో బియ్యం తప్ప మిగిలిన సరుకులు విషయంలో ఇంతవరకు ఎలాంటి స్పష్టత రాలేదు. ఆగస్టులో పామాయిల్, కందిపప్పు సరఫరా దాదాపు లేనట్టే. దీంతో తామంతా నష్టపోయే పరిస్థితులున్నాయని, షాపుల నిర్వహణ భారంగా మారిందంటూ డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కలెక్టర్‌ను కలిసిన జీసీసీ ఎండీ


కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన జీసీసీ ఎండీ కల్పనాకుమారి

మహారాణిపేట: జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్‌ను బుధవారం గిరిజన సహకార సంస్థ (జీసీసీ) మేనేజింగ్ డైరెక్టర్ కల్పనా కుమారి మర్యాద పూర్వకంగా కలిశారు. అరకు కాఫీ, సహజ సిద్ధ తేనె తదితర వస్తువులతో కూడిన కిట్‌ను అందజేశారు.

సూరత్ - బ్రహ్మపూర్ స్పెషల్ పొడిగింపు

తాటిచెట్లపాలెం: సూరత్ – బ్రహ్మపూర్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌ను మరికొంత కాలం పొడిగిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు. సూరత్ – బ్రహ్మపూర్ (09069) స్పెషల్ సూరత్‌లో ప్రతీ బుధవారం మధ్యాహ్నం 2.20 గంటలకు బయల్దేరి మరుసటి రోజు రాత్రి 8.10 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 8.12 గంటలకు బయల్దేరి మూడో రోజు తెల్లవారుజామున 1.15గంటలకు బ్రహ్మపూర్ వెళ్తుంది. ఈ స్పెషల్ రైలు నవంబరు 27 వరకు పొడిగించారు. బ్రహ్మపూర్ – సూరత్ (09070) స్పెషల్ బ్రహ్మపూర్‌లో ప్రతీ శుక్రవారం తెల్లవారుజామున 3.30 గంటలకు బయల్దేరి అదేరోజు ఉదయం 8.20 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 8.22 గంటలకు బయల్దేరి శనివారం మధ్యాహ్నం 1.45 గంటలకు సూరత్ వెళ్తుంది. నందుబార్, ధరంగ్‌వాన్, జలగావ్, భుసవల్, అకోల, వార్ధా, బల్హార్షా, వరంగల్, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, దువ్వాడ, పెందుర్తి, కొత్తవలస, విజయనగరం, శ్రీకాకుళం రోడ్, పలాస స్టేషన్లలో ఆగుతుంది.

ఆలస్యంగా నడుస్తున్న రైళ్లు

తాటిచెట్లపాలెం: పలు రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ప్రయాణికులు గమనించాలని సూచించారు.

- బుధవారం ఉదయం 7 గంటలకు డాక్టర్ ఎంజీఆర్ చెన్నై సెంట్రల్‌లో బయల్దేరాల్సిన చెన్నై సెంట్రల్ - షాలిమర్ (12842) కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ మధ్యాహ్నం 2 గంటలకు బయల్దేరింది.
- బుధవారం మధ్యాహ్నం 12.20 గంటలకు సంత్రగచ్చిలో బయల్దేరాల్సిన సంత్రగచ్చి-సికింద్రాబాద్ (07222) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ 16 గంటలు ఆలస్యంగా గురువారం తెల్లవారుజామున 5 గంటలకు బయల్దేరింది.
- బుధవారం మధ్యాహ్నం 1 గంటకు సర్ ఎం.విశ్వేశ్వరయ్య టెర్మినల్ బెంగళూరులో బయల్దేరాల్సిన బెంగళూరు – హౌరా (12864) ఎక్స్‌ప్రెస్ 3 గంటలు ఆలస్యంగా సాయంత్రం 4కి బయల్దేరింది.
- బుధవారం రాత్రి 7 గంటలకు డాక్టర్ ఎంజీఆర్ చెన్నై సెంట్రల్‌లో బయల్దేరాల్సిన చెన్నై సెంట్రల్ - హౌరా (12840) మెయిల్ మూడున్నర గంటలు ఆలస్యంగా రాత్రి 10.30 గంటలకు బయల్దేరింది.

ఉద్యోగ విరమణ చేసిన పోలీసులకు సన్మానం


ఉద్యోగ విరమణ పొందిన పోలీసులను సన్మానించిన సీపీ శంఖబ్రత బాగ్చీ

విశాఖ సిటీ: పోలీస్ శాఖలో ఉద్యోగ విరమణ చేసిన అధికారులు, సిబ్బందిని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సన్మానించారు. విశాఖ పోలీస్ శాఖలో విధులు నిర్వహించిన ఏడీసీపీ(అడ్మిన్) ఎం.ఆర్.కె.రాజు, ఏఎస్ఐలు ఆర్.వి.ఎస్.నారాయణ, మొహమ్మద్ జమాలుద్దీన్, కె.సూర్యనారాయణ, ఏఆర్ఎస్ఐ జి.ఈశ్వరరావు, కె.వెంకటేశ్వరులు, హెచ్‌సీ వి.ప్రతాప్, ఏఆర్‌హెచ్‌సీలు జె.వెంకటరవి, ఎస్.శంకరరావు, సిహెచ్.గోవిందరాజులు ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా బుధవారం సీపీ తన ఛాంబర్‌కు పిలిపించి వారికి ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. వారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. పోలీస్ ఉన్నతాధికారుల సమక్షంలో సత్కరించి వీడ్కోలు పలికారు.

సీనియర్ ఫుట్‌బాల్ పోటీల విజేత ఎస్‌కేఎంఎల్ జట్టు

బీచ్‌రోడ్డు: ఆంధ్ర విశ్వవిద్యాలయం క్రీడా మైదానం వేదికగా నిర్వహించిన జిల్లా స్థాయి సీనియర్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ విజేతగా చిన వాల్తేరుకు చెందిన ఎస్‌కేఎంఎల్ సీసీ జట్టు నిలిచింది. గొలగాని అప్పారావు, కొండల రావు స్మారకంగా ఏయూ జిమ్నాజియం మైదానంలో నిర్వహించిన పోటీల్లో జిల్లా వ్యాప్తంగా 22 క్లబ్‌లలో సభ్యులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. బుధవారం సాయంత్రం నిర్వహించిన ఫైనల్ పోటీలో చినవాల్తేరుకు చెందిన ఎస్‌కేఎంఎల్ సీసీతో ఓల్డ్‌టౌన్‌కు చెందిన ఎస్‌ఆర్‌కేఎఫ్‌సీ జట్టు పోటీపడింది. ఉత్కంఠ భరితంగా సాగిన పోరులో ఎస్‌కేఎంఎల్ సీసీ జట్టు 2 – 1 స్కోర్‌తో విజేతగా నిలిచింది. టోర్నీ విజేతకు రూ.30 వేల నగదు పురస్కారం, ట్రోఫీ, రన్నర్‌గా నిల్చిన జట్టుకు రూ.20 వేల నగదు పురస్కారం, ట్రోఫీని నిర్వాహకులు బహుకరించారు. కార్యక్రమానికి విశాఖ జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ సారథ్యం వహించింది. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు పి.వి.రవికుమార్, ఉపాధ్యక్షుడు సీహెచ్.వెంకటరావు, ఎం.మాణిక్యం, కార్యదర్శి అక్కరమాని చినబాబు, తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ సీఈ ఉద్యోగ విరమణ


రవికృష్ణరాజు


సాక్షి, విశాఖపట్నం: మహా విశాఖ నగర పాలక సంస్థ చీఫ్ ఇంజినీర్ పసుమర్తి రవికృష్ణరాజు బుధవారం పదవీ విరమణ చేశారు. కడప జిల్లాకు చెందిన రవికృష్ణరాజు 2021లో జీవీఎంసీ చీఫ్ ఇంజినీర్ బాధ్యతలు స్వీకరించారు. గ్రేటర్ పరిధిలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సింహాచలం బీఆర్‌టీఎస్ రహదారి, జగదాంబ జంక్షన్ నుంచి పాతపోస్టాఫీస్ రహదారి విస్తరణ, అక్కయ్యపాలెం రోడ్డు విస్తరణ, అల్లూరి సీతారామరాజు విగ్రహం నుంచి మారియట్ హోటల్ వరకు రహ దారి.. ఇలా ఎన్నో కీలకమైన పెండింగ్ రోడ్ ప్రాజెక్టులు పూర్తి చేయడంలో ఆయన కీలకంగా వ్యవహరించారు. నగర పరిధిలో పార్కులు, జంక్షన్ల అభివృద్ధి, ఇండోర్ స్టేడియం నిర్మాణం, 15 ఫౌంటైన్ల నిర్మాణం పూర్తి చేశారు. స్పోర్ట్స్ ఎరీనా, వీఎంఆర్డీఏ పార్క్, హెరిటేజ్ బిల్డింగ్స్ మొదలైన పనులు ఆయన హయాంలోనే పూర్తయ్యాయి. అసిస్టెంట్ ఇంజినీర్‌గా ఉద్యోగ ప్రయాణం ప్రారంభించిన రవికృష్ణరాజు.. తన పనితీరుతో తక్కువ కాలంలోనే పదోన్నతులు పొందారు. పంచాయతీరాజ్, పబ్లిక్ హెల్త్, మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగాల్లో 37 ఏళ్ల పాటు సేవలందించిన రవికృష్ణరాజు ఉద్యోగ విరమణ చేశారు. ఆయనకు జీవీఎంసీ ఎస్ఈలు, ఈఈలు, డీఈలు, ఏఈలతో పాటు ఇతర విభాగాల అధికారులు, ఉద్యోగులు పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపారు.

ఆదాయంలో 13వ స్థానంలో దువ్వాడ రైల్వేస్టేషన్

వార్షిక ఆదాయం రూ.27.2 కోట్లు

అగనంపూడి : తూర్పు కోస్తాలోని వాల్తేరు డివిజన్‌లో ఆదాయ సముపార్జనలో దువ్వాడ రైల్వే స్టేషన్ ఐదో స్థానంలో నిలిచింది. తూర్పు కోస్తాలోని వాల్తేరు, ఖుర్దా రోడ్డు డివిజన్ల పరిధిలోని 20 రైల్వే స్టేషన్ల ఆదాయం వివరాలు రైల్వే అధికారులు వెల్లడించగా, వాటిలో దువ్వాడ రూ.27.20 కోట్లతో 13వ స్థానంలో నిలిచింది. వాల్తేరు డివిజన్‌లో విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, రాయగడ తర్వాత స్థానం దువ్వాడ రైల్వేస్టేషన్‌కు దక్కింది. దువ్వాడ రైల్వేస్టేషన్ ద్వారా 5.75 లక్షల టికెట్లు జారీ చేసినట్టు సమాచార హక్కు చట్టం ద్వారా అడిగిన ప్రశ్నకు ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ కార్యాలయం సమాధానం అందించింది. దువ్వాడ రైల్వే స్టేషన్ ద్వారా రాకపోకలు పెరగడంతో ఆదాయం కూడా గణనీయంగా పెరిగిందని దువ్వాడ రైల్వేస్టేషన్ యూజర్స్ అసోసియేషన్ కార్యదర్శి కంచుమూర్తి ఈశ్వర్ తెలిపారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులు దృష్టిలో పెట్టుకొని అన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఈ స్టేషన్‌లో నిలుపుదల చేయాలని కోరారు.

అట్రాసిటీ కేసుల పరిష్కారానికి ప్రత్యేక చొరవ


మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చీ, జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిష్కారానికి సంబంధిత అధికారులంతా ప్రత్యేక చొరవ చూపాలని.. బాధితులకు సత్వర న్యాయం చేకూర్చాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ ఆదేశించారు. నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్‌తో కలిసి కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంపై డిస్ట్రిక్ట్ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై చర్చించి.. కేసుల పరిష్కారానికి అధికారులు తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. సమావేశంలో భాగంగా సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు రామారావు గత సమావేశంలో చర్చించి తీసుకున్న చర్యల గురించి వివరించారు. 138 కేసులు దర్యాప్తులో, 699 కేసులు కోర్టు ట్రయల్ రన్‌లో పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలపై జరగబోయే దాడులు, ఇతర చర్యలను ముందుగానే పసిగట్టి నివారించే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పౌర హక్కులపై ఎస్సీ, ఎస్టీలకు పూర్తిగా అవగాహన కల్పించాలని.. వారు నివాసం ఉండే ప్రాంతాల్లో ప్రత్యేక అవగాహన శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కేసుల పరిష్కారం, పరిహారం చెల్లింపులో బాధితులకు అండగా నిలవాలన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోర్టు పరిధిలోని కేసులపై దృష్టి సారించాలన్నారు. పోలీస్ జాయింట్ కమిషనర్ ఫకీరప్ప, డీసీపీ క్రైం రత్నం, ఇన్‌చార్జి డీఆర్వో శ్రీరామ్మూర్తి, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ టీవీఆర్ మూర్తి, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు, డీసీపీలు, ఏసీపీ పాల్గొన్నారు.